క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయాలైన మహేష్

అద్దంకి రూరల్: ముందు వెళ్తున్న లారీని వెనుక వస్తున్న బైకు ఢీకొట్టటంతో యువకుడికి గాయాలయ్యాయి. ఈఘటన అద్దంకి పట్టణ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని శింగరకొండపాలెం గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్ బైక్ మీద మేదరమెట్ల నుంచి అద్దంకికి వస్తున్నాడు. ఈక్రమంలో మేదరమెట్ల– నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై పట్టణ శివారులోని దాల్ మిల్లు వద్దకు రాగానే నెల్లూరు నుంచి మాచర్ల వెళ్తున్న లారీ వెనుక భాగంలో ఢీకొట్టాడు. ఈఘటనలో మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

దాతల సహకారం అభినందనీయం


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి

చినగంజాం: గ్రంథాలయాన్ని దాతలు ఆర్థికంగా సహకరించి అభివృద్ధి చేయడం అభినందనీయం అని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. చినగంజాం శాఖా గ్రంథాలయాన్ని ఆమె ఆదివారం సందర్శించి తనిఖీ చేశారు. గ్రంథాలయ రికార్డులను, వాటి నిర్వాహణను, పుస్తకాలను అమర్చిన విధానాన్ని, గ్రంథాలయంలోని సౌకర్యాలు, కంప్యూటర్ ఏర్పాటు, నిర్వాహణ, క్యాట్‌లాగ్ సిస్టం, దాతల సాయంతో ఏర్పాటు చేసిన వివిధ సౌకర్యాలను ఆమె పరిశీలించారు. లైబ్రేరియన్ కార్యాలయ నిర్వాహణ పట్ల తీసుకుంటున్న శ్రద్ధను ఆమె అభినందించడంతో పాటు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు ఆమె ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ అళహరి మోహన లక్ష్మీనరసింహచార్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ

చీమకుర్తి: సేవాసంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇద్దరు దివ్యాంగులకు పాతూరి సంపత్ రెండు ట్రైసైకిళ్లను ఆదివారం సంతనూతలపాడులో పంపిణీ చేశారు. సంపత్ తండ్రి గోవిందయ్య జ్ఞాపకార్థం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచే విద్యార్థులకు నగదు బహుమతులు ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో సేవా సంకల్ప ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటరమణ, ట్రస్ట్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


నక్కబొక్కలపాడులో ఈ-క్రాప్ జాబితా ప్రదర్శిస్తున్న వీఏఏ


బల్లికురవలో పత్తి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్న ఏఈవో కుమారి


గొర్రెపాడులో వరి పంటను నమోదు చేస్తున్న ఏఈవో

ఈ-క్రాప్‌తో బహుళ ప్రయోజనాలు

- ఖరీఫ్‌లో 14,366 మంది రైతులు
- 32,581 ఎకరాల ఈ-క్రాప్ నమోదు
- 87 ఆర్బీకేల్లో జాబితాల ప్రదర్శన
- నవంబర్ 1న తుది జాబితా

బల్లికురవ: వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పద్ధతుల వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను సాంకేతికతతో నమోదు చేస్తారు. ప్రభుత్వం పంట సాగు చేస్తున్న రైతులకు తోడ్పాటునిచ్చేందుకు ప్రవేశపెట్టిన ఈ-క్రాప్ నమోదుకు నాలేగేళ్లగా రైతు భరోసా కేంద్రాల ద్వారా సత్ఫలితాలు ఇస్తున్నాయి. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, సంతమాగులూరు, జే.పంగులూరు, కొరిశపాడు, అద్దంకి మండలాల్లో ఖరీఫ్‌లో ప్రత్తి, మిర్చి, జూట్, కూరగాయలు, కంది, పెసర, నువ్వు, ఆహార ధాన్యమైన వరి, పండ్ల తోటలను నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 14,366 మంది రైతులు, 32,581 ఎకరలకు ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారు.

ఈ-క్రాప్ నమోదు విధానం..

పంట సాగు చేపట్టిన రైతులు ఆ గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్, రబీల్లో భూమి వన్ బీ, ఆధార్ కార్డు జిరాక్స్‌తో వీఏఏకు దరఖాస్తు చేసుకోవాలి. వీఏఏ పొలం వద్దకు వచ్చి పంటను పరిశీలించి రైతు ఫొటోతో ఈ-క్రాప్ నమోదు చేస్తారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డు లేదా రైతు అంగీకార పత్రంతో ఈ పంట నమోదు చేశారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా, లక్ష లోపు రుణం తీసుకున్న రైతుకు వడ్డీలో రాయితీ, పండించిన పంటను గిట్టుబాటు ధరకు విక్రయించుకునేందుకు రిజిస్ట్రేషన్‌తో విక్రయించుకోవచ్చు. ఇన్‌పుట్ సబ్సిడీలు, దెబ్బతిన్న పంటల కొనుగోలుతో ప్రభుత్వం రైతులకు చేయూతనిస్తోంది. అంతే కాదు పంట నష్టపరిహారం కూడా అందజేస్తారు.

ఆరు దశల్లో ఈ-క్రాప్ నమోదు..

రైతులు పంట వేసిన తరువాత ఆర్‌బీకే సిబ్బంది, యాప్‌లో పంట వివరాలు అప్‌లోడ్ చేయడం, రైతును పొలం వద్ద ఫొటోతో యాప్‌లో సబ్‌మిట్ చేయడం, వీఆర్‌వో పరిశీలన, రైతు ఈకేవైసీతో ఈ-క్రాప్ నమోదు తతంగం పూర్తవుతుంది. సర్వే నెంబరు, పంట వివరాల్లో లోటుపాట్లు సరి చేసేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు సూపర్ చెక్ చేసిన తరువాత తుది జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తారు. ఈ తుదిజాబితాల్లోనూ ఏదైనా ఇబ్బందులు ఉంటే రైతులు లిఖిత పూర్వకంగా తెలియజేస్తే నవంబర్ 1న తుది జాబితాలను ప్రకటించనున్నారు.



కొప్పరపాలెం ఆర్బీకే

విపత్కర పరిస్థితుల్లోనూ పంట కొనుగోలు..



ఈ-క్రాప్ నమోదు చేయడం వల్ల ఇబ్బందులు కలిగిన సమయంలోనూ, ధాన్యాన్ని విక్రయించుకోగలుగుతున్నాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకుంటున్నాం. గతం ప్రభుత్వంలో ఇలా జరగలేదు. నానా ఇబ్బందులు పడేవాళ్లం.

– మాదాల లోకేశ్వరరావు, రైతు

దళారుల బెడద లేదు..



ఈ-క్రాప్ నమోదుతో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వల్ల చాలా లాభాలు పొందుతున్నాం. ఈప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే మద్దతు ధర లభించింది. దళారుల ప్రమేయం పూర్తిగా తగ్గింది. నిర్ణీత గడువులోపు సొమ్ము బ్యాంకు ఖాతాకు జమఅయ్యింది.

– మేదగం శ్రీనివాసరెడ్డి, రైతు

ఈ-క్రాప్ నమోదు కీలకం..



రైతులు ఖరీఫ్, రబీ సీజనల్లో ఈ-క్రాప్ నమోదును విధిగా చేయించుకోవాలి. గతంలో ఈ ప్రక్రియ ఉన్నప్పటికీ సక్రమంగా సాగలేదు. ఇప్పడు రైతు భరోసా కేంద్రాల వలన బాగా జరుగుతోంది. రైతులకు కూడా అంతేమేలు జరుగుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– కేవీ శ్రీనివాసరావు, ఏడీఏ

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, ఆశ్వీజ మాసం, కృత్తిక నక్షత్రం, విదియ తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

గృహ నిర్మాణాలు చేపట్టాలి

బల్లికురవ: ప్రభుత్వం జగనన్న కాలనీలు సొంత స్థలాలకు, మంజూరు చేసిన పక్కా గృహాలను డిసెంబర్ 31లోపు పూర్తి చేసుకోవాలని బిల్లు చెల్లింపులో జాప్యం లేదని గృహనిర్మాణ సంస్థ ఏఈ దుర్గా రమేష్ తెలిపారు. జగనన్న లే అవుట్లలో 238 గృహాలు మంజూరు అయ్యాయని, కాగా 50 గృహాలు నిర్మాణాలు చేపట్టలేన్నారు. సొంత స్థలాలకు 427 గృహాలు మంజూరుకాగా 50 గృహాలు చేపట్టలేదని ఒక్కో గృహానికి రూ. 1.8 లక్షల వరకు చెల్లిస్తున్నామని చెప్పారు. నిర్మాణ పనులు చేపట్టకపోతే ఇల్లు, ప్లాటు రద్దవుతాయని ఏఈ హెచ్చరించారు.

సేవా కార్యక్రమాలతో వెంకటేష్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు


ర్యాలీగా వస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

చీరాల: వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలతో ఆదివారం చీరాలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. చీరాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఆయన తనయుడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. వెంకటేష్ వైఎస్సార్ సీపీని బలోపేతం చేస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి వైష్ణవి, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పార్టీ పట్టణ-1 అధ్యక్షుడు కోండ్రు బాబ్జి, పార్టీ పట్టణ-2 అధ్యక్షులు గుంటూరు మాధవరావు, చీరాల మండల అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, వేటపాలెం మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, ఆర్‌బీకే చైర్మన్లు కావూరి రమణారెడ్డి, పల్లపోలు శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పులి వెంకటేశ్వర్లు, కార్యదర్శి బండారు శివపార్వతి, శిఖా సురేష్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు చీమకుర్తి బాలకృష్ణ, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.అనిల్, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, కో-ఆప్షన్ సభ్యులు, నియోజకవర్గంలో పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వెంకటేష్ త్వరగా కోలుకోవాలని కోరుతూ యానాది సంఘ నాయకులు వేటగిరి సంజీవరావు యేసు ప్రేమ సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చీరాలలోని అన్ని వృద్ధశరణాలయాల్లో అన్నదాన కార్యక్రమాలను తులాబందు వెంకటసురేష్, చీమకుర్తి బాలకృష్ణ, చిన్ని లీలాధరరావు, శిఖాకొల్లి వెంకటేశ్వర్లు, వలివేటి రాము, మురళి తదితరులు నిర్వహించారు. కామాక్షి కేర్ హాస్పిటల్, రోటరీ క్లబ్ క్షీరపురి తరుపున చీరాల ఏరియా వైద్యశాలకు రూ.20 వేల విలువైన వాటర్ మోటార్ సెట్‌ను అందించారు. కార్యక్రమంలో తాడివలస దేవరాజు, రావి వెంకటరమణ, హాస్పిటల్ సూపరిండెంట్ సుహాసిని, సిబ్బంది పాల్గొన్నారు.


వేటపాలెంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

వేటపాలెంలో..

వేటపాలెం: స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు ఆధ్వర్యంలో వెంకటేష్ జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు లేళ్ల శ్రీధర్, కట్టా గంగయ్య, జిడుగు మస్తాన్, పృథ్వీ చంద్రమోహన్, కట్టా జార్జిశ్యామేలు, అందె కృష్ణ, సాదు రాఘవ, సీతామహాలక్ష్మి, కంచి సాంబిరెడ్డి, పి శ్రీనివాసరెడ్డి, దంతం హనుమంతరావు, రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులతో అనిల్ రావిపూడి, శ్రీలీల

జే.పంగులూరు: స్థానిక పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ జూనియర్ కళాశాలలో గత ఐదు నెలలుగా రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడెమీ ఆధ్వర్యంలో ఖోఖో శిక్షణ జరుగుతోంది. ఈ జట్టు గోవాలో జరగబోయే జాతీయ క్రీడల్లో పాల్గొననుంది. శిక్షణ శిబిరం తుదిదశకు చేరుకున్న సందర్భంగా శనివారం రాత్రి రాష్ట్ర ఖోఖో జట్టును సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ శ్రీలీల వారిని అభినందించారు. అనీల్ రావిపూడి అమమ్మది జనకవరం, శ్రీలీల సొంత ఊరు పంగులూరు వచ్చిన సందర్భంగా పంగులూరులో జరుగుతున్న ఖోఖో శిక్షణ శిబిరం సందర్శించి, క్రీడాకారులను ప్రతి ఒక్కరిని పలకరించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చైర్మన్ బాచిన చెంచు ప్రసాద్, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, ఇండియన్ రైల్వే ఖోఖో శిక్షకుడు బ్రహ్మనాయుడు, శాప్ ఖోఖో శిక్షకుడు, అంతర్జాతీయ క్రీడాకారుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ యూనిట్లకు దరఖాస్తులు

బల్లికురవ: ప్రభుత్వం గొర్రెలు, మేకల పెంపకానికి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) సబ్సిడీ యూనిట్లు అందజేస్తుందని, అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి పీ. మహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20 లక్షల నుంచి కోటి వరకు గొర్రెలు, మేకల యూనిట్లు ఉన్నాయని దీనిలో 50 శాతం సబ్సిడీ, 10 శాతం రైతు వాట, 40 శాతం రుణం అందజేస్తుందన్నారు. మరిన్ని వివరాలకు పశువైద్యశాలలో సంప్రదించాలని కోరారు.

దైవప్రార్థనే ఆధ్యాత్మిక ఆయుధం

యద్దనపూడి: ఆధ్యాత్మిక ఆయుధాలైన ప్రేమ, కరుణ, దయాగుణం నీతి కలిగి ఉన్నప్పుడే మానవుడు దేవుని మార్గంలో పయనిస్తున్నట్లు అర్థమని కడప అమీన్‌పీర్ దర్గా 11వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజీ సాయేషా అరిపుల్లా హుస్సేన్ అన్నారు. మండలంలోని పూనూరు గ్రామంలో నూర్‌బాషా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మాబు సుభాని గ్యార్మీ జెండా చెట్టు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత గ్యార్మీ జెండా చెట్టు వద్ద గంథం ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులను ఆశీర్వదిస్తూ దేవుడి కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థన నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎండ్లూరి అహ్మద్, షేక్ పీర్ సాహెబ్, ఖాసీం సాహెబ్, హుస్సేన్, మీరావలి, ఎండ్లూరి పెద్ద అంజనేయులు, శ్రీను, ఇమాం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


గంధ మహోత్సవంలో గ్యార్మీ చెట్టు


భక్తులను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి హుస్సేన్

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి


నిరసన తెలుపుతున్న జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

అద్దంకి రూరల్: కావలి వద్ద ఆటోనగర్ డ్రైవర్‌పై దాడిచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎన్ఎంయూ డిపో సెక్రటరీ వందనంబాబు అన్నారు. ఆదివారం అద్దంకి డిపోలో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో డ్రైవర్‌పై భౌతిక దాడులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించాలన్నారు. దాడిని ఖండిస్తూ ఈయు నాయకులు వహీద్, టీఎన్‌టీయూసీ నాయకులు రాంబాబు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు డీఏవీ సుబ్బారావు ప్రసంగించారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ రవిబాబు

వేటపాలెం: చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ గొరాబత్తిన రవిబాబు పేర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో గల రోటరీ కమ్యూనిటీ హాల్లో ప్రొబస్ క్లబ్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిబాబు మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాధాన్యత, చిరుధాన్యాల్లో రకాలు, ఆహారంగా తీసుకోవడం ద్వారా లభించే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అవుల పున్నయ్య, సుబ్బారావు, నాగమనోహర్ లోహియా పాల్గొన్నారు.

31న ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

చీరాల అర్బన్: స్వాతంత్ర్యానికి ముందు ఏర్పడి కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను ఈనెల 31న ఘనంగా నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. ఆదివారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ ఆవిర్భవించి 104 సంవత్సరాలు అవుతుందని, కార్మికులు, కర్షకులు అందరూ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాసి పైడయ్య, ఎ.బాబూరావు, సీహెచ్ ప్రకాష్, షేక్ ముంతాజ్, జి.భారతి, ఆర్.కుమార్ పాల్గొన్నారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నాగవరపమ్మ అమ్మవారు


ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న భక్తులు

వేటపాలెం: రామన్నపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతగా పేరొందిన కనక నాగవరపమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తుల రాకతో ఆలయం పరిసరాలు కిటకిటలాడాయి. దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించుకొని అమ్మవారి చెల్లించి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ ఈవో జీవీఎల్ కుమార్, భక్తులు ప్రసాదాల పంపిణీ చేశారు.